క్లుప్తంగా

ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గ పరిశీలకుడిగా భవనం


బీ శ్రీనివాసరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకుడిగా ఇంకొల్లు మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ భవనం శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ఆయన నియోజకవర్గ పరిశీలకుడిగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సతీమణి భవనం శ్రీలక్ష్మి ఇంకొల్లు జెడ్పీటీసీగా ఉన్నారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

మినీ జాబ్‌మేళాలో 31 ఉద్యోగాలు


జాబ్ మేళాకు హాజరైన యువతీ, యువకులు

చీరాల అర్బన్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు అందిస్తుందని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి జి.సుధాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మిని జాబ్ మేళా నిర్వహించారు. స్కిల్ క్రాఫ్ట్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సాల్యూషన్స్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. మొత్తం 103 మంది హాజరుకాగా వీరిలో 31 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా స్కిల్ హబ్‌లు ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ బాపట్ల జిల్లా ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డి.రమేష్‌బాబు, సిబ్బంది నాగ వెంకట్, హారిక, అనేష్‌బాబు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

చినగంజాం: మండలంలోని చినగంజాం పంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై నాయకులు మంగళవారం పరిశీలన చేశారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలు, సీసీరోడ్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని పలువురు గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆమంచి వెంకట సుబ్బారావు, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్, ఎన్ సుబ్బారెడ్డి, ఎంపీ రామారావు, నాయకులు ఏ శ్రీనివాసరెడ్డి, రామయ్య, పటాన్ సుబాని, జాఫర్ వలి, షేక్ హుస్సేన్, నటరాజ్, సురేష్, ఎం బాబు, తిమోతి, తిరుమలరావు, వెంకయ్య, బాజీ, బలరామయ్య, హబీబుల్లా, పీ బాజీ, ఆరిఫ్,కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలందరికీ రక్ష

- పలు రకాల సమస్యలకు తక్షణ పరిష్కారం
- 63,871 ధ్రువీకరణ పత్రాలు మంజూరు
- రాష్ట్ర, జిల్లా, స్థాయిలో మొదటి స్థానంలో చీరాల
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

అందించిన ధ్రువీకరణ పత్రాలు..

సచివాలయాలు	24
అందించిన సర్టిఫికెట్లు	63,871
కుల ధ్రువీకరణ	15644
ఆదాయ ధ్రువీకరణ	5023
నివాసం	1733

1-బీ	7519
ఫ్యామిలీ మెంబర్	1033
కొత్త రైస్ కార్డులు	405
రైస్ కార్డుల్లో సవరణలు	151
ఆధార్ ఫోన్ లింకింగ్	8999
అడంగళ్	8502
వివాహ ధ్రువీకరణ పత్రాలు	46


ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వెంకటేష్ (ఫైల్)

చీరాల టౌన్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ రక్షగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళిబద్ధంగా పనిచేస్తున్నారు. నవరత్నాల పథకాలతో పేద ప్రజలకు ఆర్థికంగా చేయూత అందించడంతో పాటుగా ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాలు, విద్యాభివద్ధికి గొప్ప పథకాలు అందిస్తున్నారు. ఇదే కోవలో రాష్ట్ర ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లను గంటల వ్యవధిలోనే మంజూరు చేసేలా జూన్ 21 నుంచి జూలై 31 వరకు 'రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష' పథకాన్ని విజయవంతంగా నిర్వహించారు.

అటు రాష్ట్ర స్థాయిలో..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చీరాల మండలంలో 63,871 సర్టిఫికెట్లు ప్రజలకు అందించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అంతేకాకుండా జిల్లా స్థాయిలో కూడా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో తోటవారిపాలెం-1 సచివాలయం మొదటిస్థానం, కావూరివారిపాలెం సచివాలయం మూడో స్థానంలో నిలిచిందన్నారు. వాడరేవు ఆరో స్థానంలో నిలవడం గర్వంగా ఉందని అధికారులు చెప్తున్నారు. తోటవారిపాలెం సచివాలయం-1లో అత్యధికంగా 10,571 సర్వీసులు, కావూరివారిపాలెం 8486 సర్వీసులు, వాడరేవు సచివాలయం 6152 సర్వీసులు అందించారు.

ఇటు జిల్లా స్థాయిలో..

బాపట్ల జిల్లా పరిధిలో చీరాల మండలం జగనన్న సురక్ష పథకంలో 63,871 సర్వీసులు అందించి రాష్ట్రం, జిల్లాలో చీరాల రూరల్ మండలం మొదటి స్థానంలో నిలిచింది. అధికారుల సమర్థవంతంగా విధులు నిర్వహించడం, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ కార్యక్రమాన్ని ఎక్కడా కూడా లోటు లేకండా నిర్వహించారు. రూరల్ మండలంలోని సచివాలయాల్లో నిమిషాల వ్యవధిలోనే ప్రజలకు కావాల్సిన కుల, ఆదాయ, మ్యుటేషన్, వివాహ ధ్రువీకరణ, రైస్ కార్డులో సవరణలు, అడంగళ్ సవరణలు తదితర అన్నీ సేవలు అక్కడికక్కడే అందించారు. అన్నిశాఖల అధికారులు, వలంటీర్లు అందరు సమర్ధంవంతంగా పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈకార్యక్రమవ ద్వారా సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

> **సమష్టి కృషితోనే రాష్ట్రస్థాయిలో నిలిచాం..**
>
> 
>
> జగనన్న సురక్ష కార్యక్రమం మొదటిరోజు నుంచి ఆఖరి రోజు వరకు ప్రజలకు ఏ ధ్రువీకరణ పత్రం కావాలో ఇచ్చిన అర్జీని నిమిషాల వ్యవధిలోనే సిబ్బంది కృషితో పత్రాలు అందించాం. రెవెన్యూ, అన్నీ శాఖల సిబ్బంది సహకారంతో సమర్థవంతంగా పనిచేశాం. ఫలితంగా రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాం. సక్రమంగా పనిచేసిన రెవెన్యూ ఉద్యోగులకు, సహకరించిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి అభినందనలు.
>
> – జీవిగుంట ప్రభాకర్‌రావు, తహశీల్దార్ చీరాల

> **ప్రతీ పథకం పేదల అభివృద్ధి, సంక్షేమం కోసమే..**
>
> 
>
> సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రతీ పథకం పేదల సంక్షేమం కోసమే. జగనన్న సురక్ష కార్యక్రమంలో చీరాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం. ప్రజలకు కావాల్సిన అన్నీ ధ్రువీకరణ పత్రాలను అధికారులు నేరుగా తీసుకువచ్చి అందించడం శుభపరిణామం. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ఎమ్మెల్యే కరణం బలరాం, నేను ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నాం.
>
> – కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, చీరాల

అందరికీ అందుబాటులో మహిళా మార్ట్


వస్తువులు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల టౌన్: పేద, మధ్య తరగతి ప్రజలకు కావాల్సిన అన్నీ రకాల నిత్యావసర సరుకుల సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి సరుకులను కొనుగోలు చేశారు. మహిళా మార్ట్‌లో అందుబాటులో ఉన్న సరుకుల వివరాలు, నాణ్యత వివరాలు ఏపీఎం సుబ్బారావును అడిగితెలుసుకున్నారు. అనంతరం మార్ట్‌లో వస్తువులను కొనుగోలు చేసి నగదు చెల్లించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వైఎస్సార్ కేపీ సిబ్బంది ఉన్నారు.

ఆంజనేయుడికి తమలపాకుల పూజ


ఆకు పూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

అద్దంకి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామికి మంగళవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా దేవస్థానంలో ప్రాతః కాలమందు సుప్రభాత సేవ, గోపూజ, బిందెతీర్థం, అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, ఉభయదాతలు ధ్వజ సంభానికి నారీ ఫలాలు సమర్పించారు. 11 ఆవృత్తాలతో లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలు సాయిఆదిత్య కృష్ణవేణి, వేద పండితులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

పర్చూరు (చినగంజాం): పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పలు ప్రజా సమస్యలపై స్పందించారు. మంగళవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను పరిష్కరించారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు ప్రజా ప్రతినిధులు గ్రామాలకు చెందిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో పర్చూరు మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, కారంచేడు కన్వీనర్ దండా చౌదరి, వైస్ సర్పంచ్ తోకల కృష్ణమోహన్, కుక్కపల్లి నాగేశ్వరరావు, అడపా సుధాకర్ రెడ్డి, ఉప్పలపాటి చెంగలయ్య, లంక శివ, మల్లా శ్రీనివాసరావు, ముప్పాళ్ల రాఘవ, ఒగ్గిశెట్టి ప్రసాద్, జంగా అనిల్, రాంబాబు, ఆకుల హేమంత్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ ప్రభుత్వ సంక్షేమం

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


మహిళతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: గడప గడపకూ సంక్షేమ పథకాలను అందజేస్తోంది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయతీ పరిధిలో గల కృష్ణంరాజువారిపాలెం (రెడ్డిపాలెం)లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి వాటిని అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంచుతూ పొందిన లబ్ధి గురించి వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని సంక్షేమ పథకాలు ఇస్తుంది ప్రస్తుత జగన్న ప్రభుత్వమేనని, రానున్న ఎన్నికల్లో కూడా సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటామని గ్రామస్తులు చైతన్యకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్న కుమారి, స్థానిక నాయకులు, వలంటీర్లు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


రాయితీ విత్తనాలు అందిస్తున్న రమణారెడ్డి

చీరాల టౌన్: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తోందని ఆర్‌బీకే చైర్మన్ కే రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయితీలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం మంజూరు చేసిన పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చీరాల మండలానికి 50 శాతం సబ్సిడీపై 34 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏవో ఐ.సుమతి, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి


బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

పర్చూరు (చినగంజాం): దళిత రైతుని మోసగించి కులం పేరుతో దూషించిన షేక్ హసన్‌వలిని వెంటనే అరెస్ట్ చేయాలని బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పర్చూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించిన పూర్వపరాలను తెలుసుకునేందుకు ఆయన మంగళవారం మండలంలోని వీరన్నపాలెం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇందులో బాగంగా ఆయన బాధితుడు గుజ్జర్లపూడి సామ్యూల్ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఘటనపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి సత్వర న్యాయం జరిపించేందుకు ప్రయత్నం చేస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

కన్నుల పండువగా సీతారాముల శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

చీరాల అర్బన్: పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సీతారామ, లక్ష్మణ స్వామి వార్ల శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. లోక కల్యాణార్థం భద్రాచలం నుంచి సీతారాముల వారి రథం సాయంత్రం చీరాలకు వచ్చింది. స్వర్ణరోడ్డులోని ఎస్‌ఆర్‌డీఆర్, ఎస్‌వీపీ ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉంచారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో, విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భక్తులు 'జై శ్రీరామ్'అంటూ నామస్మరణలతో శోభాయాత్ర పట్టణంలో శోభాయమానంగా సాగింది. బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని రామమందిరం వీధిలో జానకిరామ ఎస్టేట్స్ వద్ద శ్రీసీతారాముల స్వామి వార్ల తిరుకళ్యాణం భద్రాచల దేవస్థాన ప్రధాన అర్చకుల చేత వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని శ్రీరాం త్రివిక్రమ్ మెమోరియల్ ట్రస్ట్, వికాస తరంగిణి చీరాల శాఖ, సమస్త భక్త బృందం ఆధ్వర్యంలో జరిగింది.

నర్సరీలకు లైసెన్స్‌లు తప్పనిసరి


నారును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

యద్దనపూడి: షేడ్ నెట్ నర్సరీలు నిర్వహిస్తున్న యజమానులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని పర్చూరు ఉద్యానశాఖ అధికారి డి.రవిప్రకాష్ బాబు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని యనమదల దండుదారి వద్ద ఉన్న షేడ్ నెట్ నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా నర్సరీలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సస్యరక్షణ చర్యలపై నర్సరీ యజమానులకు అవగాహన కల్పించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

బల్లికురవ: పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, వీటిలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్ట్ సీడీపీవో డీ. సుధ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొప్పరపాడు, అంబడిపూడి గ్రామాల్లో తల్లిపాల విశిష్టతపై అవగాహన సదస్సు, ర్యాలీల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సలోమి, ఏ.విజయ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా


చీరాలలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని


అద్దంకిలో రాజకీయ పార్టీల నాయకులతో చర్చిస్తున్న తహసీల్దార్

చీరాల టౌన్: ఓటరు జాబితా సవరణలు, నూతన ఓట్లు చేర్పు, మార్పులు అన్నీ నిష్పక్షపాతంగా చేస్తున్నామని ఆర్వో, చీరాల ఆర్డీవో పి.సరోజిని తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చీరాల నియోజకవర్గంలోని అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా సవరణలు, నూతన ఓటు అర్జీలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో నూతన ఓటుహక్కు దరఖాస్తులు, పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు మార్పు, సవరణలకు వచ్చిన అర్జీలన్నింటిని నిశితంగా, నిష్పక్షపాతంగా విచారణలు చేయిస్తున్నామని, డబుల్ ఎంట్రీలు, జాబితాలో వచ్చిన క్లైమ్‌ల విచారణను నిష్పక్షపాతంగా చేస్తున్నామన్నారు. ఓటరు రివిజన్, సవరణలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. సమావేశంలో తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, రీసర్వే డీటీ అర్జున్, అన్నీ రాజకీయపార్టీల నాయకులు ఉన్నారు.

అద్దంకి రూరల్: ఓటర్ల జాబితాను పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని అద్దంకి తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రచయిత తాటిపర్తి మృతి


కోటిరెడ్డి (ఫైల్)

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామ కవి, వాస్తు పండితుడు తాటిపర్తి కోటిరెడ్డి (80) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో చనిపోయాడు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో వాస్తు పండితుడిగా కోటిరెడ్డికి మంచిపేరుంది. గృహనిర్మాణాలు చేపట్టేందుకు ప్లాను, వాస్తు లోపాలు లేకుండా చూడటంతో మంచి దిట్ట, రెడ్డిరాజుల చరిత్రను పరిశోధనలతో అనేక గ్రంథాలు తయారు చేశారు. కరోనాను సైతం జయించి చురుకుగా తిరుగుతూనే నిద్రలోనే గుండెపోటుతో చనిపోయి నట్లు కుమారుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య సుబ్బాయమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

జే.పంగులూరు: మండల పరిధిలోని 21 గ్రామాల్లో ఆగస్టు మొదటి రోజు మంగళవారం వివిధ రకాల వైఎస్సార్ పింఛన్లు పంపిణీ జరిగాయి. 98 శాతం పింఛన్ పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో రామంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రతి నెల నూటికి నూరు శాతం పూర్తి చేస్తున్నట్లు, ప్రతి ఇంటికి తిరిగి తమ పరిధిలోని వారందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.


ఆరికట్లవారి పాలెంలో మంచంలో ఉన్న వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్